# దశావతారాలు

**శ్రీ అవసరాల రామకృష్ణారావు**

'అమ్మా, అమ్మా! వాళ్ళొస్తున్నారే!' అని యింట్లోకి పరిగెట్టింది చిన్నమ్మలు. ఈ కేక విని సుబ్బమ్మగారు వీథిలోకివచ్చి తొంగిచూసి 'వెనకటికి నీ తరహాకి చెందినవ్యక్తే 'నల్లచీర కట్టుకున్నవాళ్ళంతా నా పెళ్ళాలే' అన్నాడుట. వీథిమొన తిరిగిన బండీఅల్లా మనంటికివచ్చినట్టేనటే?' అంది. 'అదేం మాటే? 'బాలవాక్యం బ్రహ్మవాక్యం' అన్నారు. మనింటికే రాకూడదా ఏమిటి?' అని సమర్థించారు సోమన్నగారు. అనుకున్నట్టే ఆ జట్కాబండీ వాళ్ళగుమ్మంలోనే ఆగింది. సుబ్బమ్మగారు లోపలికి వెళ్ళిపోయింది. ఆ బండీలోంచి గళ్ళగళ్ళ పరుపుగుడ్డలాంటి బుష్‌కోటు తొడుక్కున్న యువకుడు దిగేడు. దిగుతూనే 'తెలుగుమేష్టరు సోమన్నగారిల్లిదేనాండి?' అని అడిగాడు. 'అవును బాబూ, ఆ సోమన్నను నేనే' అన్నారు సోమన్నగారు. 'నా పేరు అవతారం అంటారు లెండి. కాకినాడలో యింజనీరింగు చదువుతున్నాను. నిజానికి యిలాంటి వ్యవహారాలంటే విపరీతమయిన సిగ్గండి నాకు. అయినా మా ఫాదర్ మాటతోసెయ్యటానికి నాకు మనస్కరించలేదు. మా నాన్న యిదంతా మీకు రాశారుట కదూ?' అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి. సోమన్నగారు లోపల్నుంచి ఓ కార్డు తీసుకొచ్చి 'ఇదేనా బాబూ?' అన్నారు. 'అవునండి అదే. మీ యింట్లో పెళ్ళికి ఎదిగిన పిల్ల ఉందని......' మిగతా మాటలు మాట్లాడలేక సిగ్గుపడిపోయాడు అవతారం. 'అదేమిటి బాబూ, యింతసేపు నిలబెట్టేసినారు? బండీకి డబ్బులు?' వీథిలోంచి బండీవాడు కేకపెట్టేడు. 'నాదగ్గర టెన్‌రుపీస్ నోటు ఉందోయ్. చిల్లరుందా?' బండీవాడు అడ్డంగా తల ఆడించాడు. 'నే నిస్తానోయ్' అంటూ సోమన్నగారు. 'తమకెందుకండీ శ్రమ? వాడే మార్చుకొస్తాడు' అని అవతారం అంటున్నా వినిపించుకోక బండీవాడికి డబ్బులిచ్చి పంపేశాడు.

సుబ్బమ్మగారు పక్కింటికి గబగబా వెళ్ళేసరికి పెద్దమ్మలు పొరుగింటి రమణమ్మతో చింతపిక్కలాడుతోంది. 'తెల్లారిలేచి యీఆటఏమిటే పెద్దమ్మలూ, మరేం పని లేనట్టు? పద పద పెళ్ళివారొచ్చారు' అని రెక్కపట్టుకుని లేవదీసుకుపోయింది. పక్కింటి జానకిరాముడు 'ఎవరి మాట పిన్నిగారూ?' అని అడిగింది. 'మొన్న దీపాలెట్టేవేళ బందరునుంచి ఉత్తరం వచ్చిందని చెప్పేను కాదుటమ్మా? వాళ్ళ తాలూకేట. అబ్బాయి ఒక్కడే వచ్చాడు. ఏదో నీ దయవల్ల యీ మూడుముళ్ళూ పడిపోతే మరి అడక్కు. వస్తానమ్మా. పదవే!' పెద్దమ్మల్ని తీసుకుని సుబ్బమ్మగారు యింటికొచ్చింది.

'ఏదో చదువుకోసం, ఫ్రండ్స్‌తో తిరగడం తప్ప మీలాంటి పెద్దమనుషులతో మాట్లాడి ఎరగనండీ! అసలు యిలాంటి పని మీద రాడానికి నాకు ఎంత మొహమాటంగానైనా ఉంది' అవతారం యిలా అంటూండగా చిన్నమ్మలు అక్కడ కాఫీ యిడ్లీనూ తెచ్చిపెట్టింది.

'మీరు యిస్తున్నారని మాట తీసెయ్యలేక తింటున్నాను కాని నాకేం ఆకలి లేదండీ! నాగురించి నేనే అంతా చెప్పుకోవలసి వచ్చినందుకు ఎంతయినా మొహమాటంగా ఉందనుకోండి మా నాన్నగారికి తాసీల్దారు పనామరి, క్షణం తీరిక ఉండదు. మా అమ్మను తీసుకువద్దామనుకున్నాను గాని సమయానికి యింట్లోకి రాడానికి వీల్లేకపోయిందండీ. అయినా 'నీ కిష్టమయితే నా కిష్టమే బాబూ' అంది. మావాళ్ళయినా మనుషులు పూర్వకాలపు వాళ్ళు గాని భావాలన్నీ యీనాటివేనండీ!'

'అలాగా!'

'చాలా పెళ్ళిళ్ళు పెద్దల యిష్టప్రకారం జరిగినవే గాని కుర్రాళ్ల యిష్టాయిష్టాలు కనుక్కొని జరిగినవి అరుదు. ఎంతమంది పిల్లలు మంచిమంచి ఉద్దేశాలో పెద్దల్ని ఎదిరించలేక శాశ్వతంగా నిద్రపోతున్నాయి. కాని మా యింట్లో అలా కాదుసుమండీ పెద్దలికి తోచిన ఉద్దేశాలు ఏవయినా సరే మంచివే అని వాళ్ళకు నమ్మకం లేదు. ఉద్దేశానికి మంచీ చెడూ ఆపాదిస్తాంగాని ఆ భావం పెద్దలు కల్పించిందా, లేక పిల్లలకు తోచిందా అని చూసుకుని దానికి విలువ కట్టరు. దేనికయినా పెద్దల సపోర్టు కావాలి. ఏమంటారు?'

'అయ్యో, కాదు మరి!'

'తల్లితండ్రులు ఏర్పరిచిన ఓ చక్కని చుక్కను కట్నంతోసహా పెళ్లాడేసి సంభాషణలలో సాహిత్యమంతా ఒలకబోస్తే సంస్కరణ ఏముందండీ? అందచందాలు, డబ్బు ఉన్న అమ్మాయికి ఎలాగేనా పెళ్ళవుతుంది. దేవుడిచ్చిన దిక్కుమాలిన రూపానికి విచారిస్తూ, బీదకుటుంబంలో పుట్టిన దురదృష్టానికి చింతిస్తూ నిత్యం కుమిలిపోయే నిర్భాగ్యులను దరిచేర్చడమే సంస్కారమంటాను. అలా చేస్తేనే మనసుకి శాశ్వత తృప్తి ఉంటుంది.'

సోమన్నగారి హృదయం కరిగిపోయింది. 'ఇలాంటి పదిమంది యువకులుంటే నాలాంటి ఆడపిల్లల్ని కన్న దౌర్భాగ్యులు కన్నీరుకార్చే అవసరం రాదుకదా!' అనుకున్నారు.

'చిన్నవాడివయినా నీకింత జ్ఞానం ఎలా కలిగిందోయ్?' అని పైకి అనకుండా ఆ ముసలిప్రాణం ఉండలేకపోయింది.

'ఇందులో నే పెద్ద చేసిం దేముందండి? పరిస్థితుల్ని సత్యదృష్టితో పరికించి తదనుగుణంగా నడవడం కూడా ఓ ఘనతేనా? సరే కాని...'

'ఏమిటి బాబూ?'

'ఇలా మాట్లాడుతూనే ఉన్నాను గాని నాకెంత...'

'ఏమిటోయ్?'

'ఎందుకులెండి మీకు మరింత శ్రమగాని...'

'శ్రమ కేముందోయ్. నీలాంటి వాడికి ఏం చేసినా తప్పులేదు. చెప్పు'

'మరేం లేదు, మీ అమ్మాయిని చూడ్డానికి ఏమయినా ఆలశ్యముందా?'

'ఆడపిల్ల కాదు బాబూ? అందులో మీ అత్తగారికి చాదస్తమెక్కువ. అయినా మరోటీ మరోటీ గనుక నా? అందుకని కాస్త ఆలశ్యమే అవుతుంది.'

'మరేం లేదండీ, తలనొప్పి దంచేస్తోంది.'

'అయ్యో అలాగా, చెప్పేవు కావేమోయ్? అమృతాం

జనం యిమ్మన్నావా? యాస్ప్రో వేసుకుంటావా?'

'ఎందుకొచ్చిందో దానివల్ల పోవాలిగాని యీ మందులవల్ల ఏం లాభంలెండి.'

'ఎందుకొచ్చిందీ?'

'అదేమిటో మీ మొహంచూసిన దగ్గిర్నుంచీ మీరంటే ఏదో పూర్వజన్మ సంబంధం ఉన్నట్టు ఎంతో అభిమానం వేస్తోంది. మా నాన్నగారి దగ్గిరయినా యింత చనువుగా మాట్లాడి ఎరగను. పెద్ద పెద్ద బాధలొచ్చినా దిగమింగుకోడమే గాని 'ఈగ వాలనా, 'యీ' పెట్టనా?' అనే స్వభావం కాదు నాది. అయినా మిమ్మల్ని చూస్తే ఎంత స్వల్పమైన బాధ కలిగినా చెప్పుకోకుండా ఉండబట్టింది కాదండీ!'

'సరేగాని నీ తలనొప్పి ఏంచేస్తే పోతుందో చెప్పేవుకావు.'

'ఎందుకండీ, వచ్చినపని చూసుకునిపోక మిమ్మల్ని యిబ్బంది పెట్టడం?

'అలాకాదు. చెప్తేకాని వదలను. నీ యిల్లు ఒకటి మా యిల్లు ఒకటీనా? నీ బాధ ఒకటీ నా బాధ ఒకటీనా? చెప్పు.'

'మీరంత ఆప్యాయంగా అడుగుతూంటే ఊరుకోడం తప్పే అనిపిస్తోంది. మరేం లేదండీ. నాకు శనివారం శనివారం తలంటుకోడం అలవాటు. 'ఏంచేత చెప్మా యింత తలినొప్పి వచ్చిందీ' అని ఆలోచిస్తే అప్పుడు తెలిసింది 'ఓహో, యిదా' అని. ఈ అభ్యంతరం తీర్చుకుంటేగాని యిది వదలదు. ఇంటికెళ్ళి తీర్చుకుంటానులెండి. ఈమాట చెప్పడానికి నా ఒళ్లెంత చచ్చిపోయిందో మీకు చెబితే అర్థంకాదు. మీరు అడిగారని మొహమాట పడి ఉన్నమాట కక్కేశానుగాని, మీరు ఊఁ శ్రమపడి ప్రయత్నాలు చేయించకండి.'

'ఓయి వెర్రివాడా, యింత అమాయకమేమిటోయ్ నీకు? ఎలా బతుకుతావోయ్? తలంటు నిరభ్యంతరంగా తీర్చుకోవచ్చు. ఉండు, వస్తాను.'

సోమన్నగారు యింట్లోకి వెళ్లి అన్ని సంగతులూ సుబ్బమ్మగారితో చెప్పేరు.

'ఇవాళ లేచినవేళ మంచిదండి! ఇంతకీ మన పెద్దమ్మలు అదృష్టం. మీరు మళ్ళీ మంగలి అప్పన్నను కేకేశారు గనుక. నా అల్లుడికి నేను తిప్ప మరోరు తల కడగడానికి వల్లకాదు. పండుగనాడు అల్లుడొచ్చి తల రుద్దమన్నంత సరదాగా ఉంది నాకు. పాపం హఠాత్తుగా వచ్చాడు కాబోలు. గుడ్డలు తెచ్చుకున్నట్టు లేదు. ఇలాంటి సమయంలో మనం వెనుదీసి లాభం లేదు. చూడండి, బీరవాలో మీ సన్న జరీ పంచ ఉంది, అదిచ్చి కట్టుకోమని యిలా పంపండి. చిన్నమ్మలు పులుసు పోస్తుంది. పాపం ఎంత తలనొప్పిగా ఉందో ఏమిటో!' అని మొగుడ్ని పంపించి, జడవేస్తున్న కూతురుతో అంది సుబ్బమ్మగారు.

'జడేస్తూంటే అదేమిటే ఊఁ అలా కదిలిపోతావ్? తాసిల్దారుగారి కోడలూ, యింజనీరుగారి భార్యా అని గర్వం కాబోలు. ఇకముందు మాతో మాట్లాడతావా, ఏమే పెద్దమ్మలూ?, అని కూతురు నొసట మెటికలు విరిచి 'చూడు పెద్దమ్మలూ, నేను అల్లుడికి తలంటాలి. మంచి చీరా జాకట్టూ తీసికట్టుకో. మొహం మరోమారు కడుక్కో.' అని పెరట్లోకి బయలుదేరింది.



"తెలుగుమేష్టరు సోమన్నగారిల్లిదేనాండి?"

## అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవుట, అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, అకలి, తరచుగా చక్కెరతో మూత్రం బీయలు వెడలటము, దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటంవల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)



## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.



## గనోక్విక్

అన్నిసెగలకు గంటలలోగుణము

ఈశ్వరఫార్మశీ, రాజమండ్రి.


'ఏమోయ్, అమ్మాయిని తీసుకురమ్మన్నావా?'

అవతారం మాట్లాడలేదు.

'అలా నిలదీస్తే ఏం జవాబు చెప్తాడండీ? అసలే తలనొప్పి. దాంతో తలకు నీళ్ళోసుకున్నాడు. నీరసంగా ఉందో ఏమిటో. భోంచేశాక మాసుకుంటాడు లెండి. ఏం బాబూ?'

'పెద్దలు మీ మాట, తీసెయ్యలేక గాని యింత తొందరగా నే ఎప్పుడూ పరాయి యింట్లో విస్తరేసి ఎరగను?'

'ఎంత మాటన్నావు బాబూ. ఇది నీకు పరాయి యిల్లా?'

'కాదనుకోండి. మహాలక్ష్మిలాంటి మీ ముఖలక్షణాలు చూస్తే అనకూడదు గాని నాకు దణ్ణం పెట్టబుద్ధేస్తోందండీ సుబ్బమ్మత్తగారూ!'

సుబ్బమ్మగారి మనసు ఆనందంతో కొగులో వేణీళ్లలా పరుగులెట్టింది.

* * *

'ఒహో! ఏం గౌరవం, ఏం వినయం! పిల్లాడు మహాబుద్ధిమంతుడిలా ఉన్నాడు. ఏమంటారు?' అంది భోజనాల అనంతరం సుబ్బమ్మగారు భర్తతో.

'ఆ మాట వేరే చెప్పాలిటే? అంత పెద్ద చదువు చదువుతూ అలాంటి గొప్ప కుటుంబానికి చెందినవాడైతే మరోడు కిందా మీదా ఉండునా? అలాంటిది ఎక్కడయినా నోటిమాట ఉందా? నిండుకుండ తొణకదన్నారు. ఇంతకీ మనమ్మాయి చేసుకున్న అదృష్టం. అతను చూసి అవుననన్నట్టయితే మనకన్న అదృష్టవంతులు లేరనుకో.'

'అలాగే. చిన్నమ్మల్ని కోటయ్య కొట్టుకి పంపేను, తమలపాకులు తెస్తుంది. వేసుకుంటూండండి. ఈలోగా నేనూ పెద్దమ్మలూ భోంచేసి తీసుకువస్తాను' సోమన్నగారు వీధిలోకి వెళ్లిపోయాడు. ఇంతలో జానకిరాముడు సెయ్యి అప్పళొచ్చింది.

'ఏమిటి పిన్నిగారూ యీవాళ పిండివంటలూ?'

'ఏదో 'చంద్రుడికో నూలుపోగు' అని మాకు తోచింది పెట్టేం గాని వాళ్లెక్కడ, మేమెక్కడ? అప్పటికప్పుడు ఏం చెయ్యను? అయినా బాగుండదని యింట్లో సగ్గుబియ్యం ఉంటేనూ, యింత పరవాన్నం చేసిపెట్టేను.'

'అబ్బాయి తలంటుకున్నట్టున్నాడు?'

'ఏం తలంటులే. పాపం ఆ యబ్బాయి ఎంత బాధయినా పైకి చెప్పనే చెప్పడు. తలనొప్పి అంటేనూ ఓసారి కొస్తములాగ్గా తలకడిగేనేమో, అంతే.'

'అయినా అటు వంటా, యిటు తలంటూ, అమ్మాయిముస్తాబూ మీ ఒపిక్కి సంతోషించాలి. ఇంతకీ పిల్లాడు పిల్లని చూచుకున్నాడా?'

'లేదమ్మా! ఇదుగో మా భోజనాలు అయ్యాక తీరిగ్గా పిల్లని చూపిస్తాము. ఏదో యిది కుదిరిపోతే యిద్దరి చేతా సత్యన్నారాయణవ్రతం చేయిస్తాను.'

'ఎందుకు కుదరదు లెండి! ఇంతకీ అల్లుడు ఏం చదువుకున్నాడో?'

'ఇంజనీరుంగుటమ్మా'

'అంటే?'

'ఏమో. ఫలానా అని నాకు తెలీదూ, అంటే వినడమే గాని. బందరులో కాబోలు చదువుతున్నాడట.'

'బందరులో ఇంజనీరింగు లేదని చెప్పుకుంటారు?'

'ఏమోనమ్మా, మన కెందుకూ అక్కర్లేని మగాళ్ల భోగట్టాలూ? చెయ్యి ఊరికే లేదు. మళ్లీ వాళ్లు కనిపెట్టుకు ఉంటారు. వస్తానమ్మా జానకిరాముడూ!'

* * *

'ఎలా వుంది నాయనా అమ్మాయి?'

సమాధానంకోసం మూడుజీవాలు అత్యాతురతతో నిరీక్షిస్తున్నాయి. ఆ ప్రశ్నకే వ్యతిరేక సమాధానాలతో తల్లడిల్లిపోయిన ఆ తండ్రిప్రాణం విద్యార్థి పరీక్షాఫలితాలకు ఎదురుచూసినట్లు నిరీక్షించసాగేడు. అవతారం తలెత్తి మరోసారి చూశాడు. దగ్గరగా వచ్చి చూస్తేనేగాని కనపడని కళ్లూ, పైకొచ్చిన పళ్లూ, విపరీతమయిన ఒళ్లూ ఇదీ ఆ అమ్మాయి ఆకారం. చీర బీరాకు పచ్చరంగూ, జాకెట్టు ముఖమల్ ముదరనీలంరంగూ, ముఖం ముద్దుకృష్ణుడి రంగూ యివీ ఆ అమ్మాయిలో రంగురంగులు.

'మీరు బలవంతపెట్టేరు, చిన్నప్పట్నుంచీ పెద్దలమాట తోసెయ్యలేని స్వభావంచేత చూశానుగాని పిల్ల అందచందాలు నాకు అక్కర్లేదని చెప్పేనుకదూ?'

సోమన్నగారు ధైర్యంగా గుండె రాసుకున్నారు.

'గుడ్లగూబలా పెద్దపెద్ద కళ్లుంటే సరిటండీ? అయినా పెద్ద కళ్లుంటే నలుగురివైపూ తేరిపార చూడ బుద్ధేస్తుంది. ఉన్నాయా లేవా అన్నట్లు ఎలక పళ్లలా ఉంటే కోపమొచ్చినప్పుడు మొగుడ్ని కొరకడానికయినా పనికొస్తాయా, పట్టేసి పైకి కనిపించాలిగాని! ఇక రంగన్నారా? కళాకాంతీ లేకుండా తెల్లగా అప్పడంలా ఉంటే సరా, కళాకాంతీ ఉండొద్దూ?'

సిగ్గుతో పెద్దమ్మలు బుగ్గలు ఎరుపెక్క

లేదు గాని తల మాత్రం వాలిపోయింది సుబ్బమ్మగారి ఒళ్లు కూడా పులకరించక పోలేదు.

'ఇలానే ఎదురుగుండా మీ అమ్మాయిని వర్ణిస్తాంటే ఏమనుకుంటున్నారో ఏమిటో! చక్కనివస్తువు కనపడగానే సౌందర్యోపాసి నవడంవల్ల నా హృదయం నాకు తెలీకుండానే నా నోటిచేత కావ్యాలు అల్లించేస్తుంది! అయినా ఎదురుగుండా ఏమీ తేల్చకపోవడం, వెనకనుంచి రాస్తామని కన్న తండ్రుల్ని ఆశపెట్టడం, యిలాంటివి బొత్తిగా నాకు కిట్టవు.'

'అయితే అమ్మాయి నచ్చినట్టేనా బాబూ?' సుబ్బమ్మగారు అడిగింది.

'ఆమాట వేరే చెప్పాలిటే? ఇంతకీ వాళ్ళువాళ్ళు ఒప్పుకోవాలి'

పెద్దమ్మలు ఒక్కసారి లేచి చివాలున పక్కనున్న చీకటిగదిలో కలిసిపోయింది.

'వెర్రితల్లికి అప్పుడే ఎంత సిగ్గో!' అంది సుబ్బమ్మగారు.

'ఆడపిల్లలు కదండీ ఆర్జించుకున్నదే సిగ్గు! అమ్మాయి పేరేమిటి అన్నారూ?'

'వెంకటకాముడని, ఆ రోజుల్లో పెట్టిన పేరులే. దరిమిలా మార్చుకోవచ్చు'

'ఛ! ఎంతమాటన్నారు? పెద్దలు పెట్టిన పేరుని మార్చడమా? ఎంత సాహసం! నా పూర్తి పేరు 'పంగనామాల చిన వరహావతారం' మార్చుకున్నానా? సరేగాని చూడండి. నే యిలా హఠాత్తుగా రావడం, సాంప్రదాయవిరుద్ధంగా అప్పటికప్పుడు ఒప్పేసుకోడం యివన్నీ చూసి మరోలా అనుకోకండి. ఇంటికెళ్లి అన్ని సంగతులూ రాయిస్తాను. మీరు వచ్చి మాట్లాడుకుందురు గాని, మరి శలవా?'

'అదేమిటీ అప్పుడే వెళ్ళిపోవడం, రెండురోజులు ఉండకూడదా?' చిన్నమ్మలు అడిగింది.

'చూడండి, యింత చిన్నపిల్ల ఉందో లేదోగాని ఎంత మర్యాదో? అదంతా కుటుంబ ధర్మాల్ని బట్టి ఉంటుంది. మళ్ళీ కాలేజీపాఠాలు పోతాయమ్మా. ఈసారి వచ్చి చాలా రోజులు ఉంటాగా! వస్తానండీ సుబ్బమ్మత్తగారూ!'

సుబ్బమ్మగారు భర్తను యివతలికి పిల్చి అడిగింది.

'ఇంకా ఆ పంచె విప్పి యియ్యడేం?

'ఛీ, పాడు ఆలోచనలూ నువ్వూను! తాసీల్దారుగారి కొడుకు మన యింట్లో పంచెకోసం ఆ వూర్నించి ఈవూరు వచ్చాడేం? ఆ అబ్బాయి హుందాతనం ఎలా ఉంది. నీ నిందాత్మకభావన లెలా ఉన్నాయి?' అని కసురుకున్నారు సోమన్నగారు.

'బాగానే ఉందిగాని, స్టేషనుకు వెళ్ళి అల్లుడ్ని దిగబెట్టిరారూ?'

'నిజమే సుమీ, యీమాట నాకు జ్ఞాపకమే లేదు. వెడతాను తలుపేసుకో.'

* * *

'ఒకళ్ళది ఎడంచేత్తో ముట్టుకుని ఎర



రు 1000 బహుమానం

లెపర్సీ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మీ అండ్ కో

(రిజిష్టర్డు)

H. O. వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధినగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc



ఈ సొగసైన "ట్రై సైకిల్"-కు మీ ఆర్డర్లు పంపండి. ఇది ఉత్తమమైనది. కొత్తది ధరలు రు 25/-లు నుండి రు 15 లకు తగ్గింపబడినవి. రైలుఛార్జి షుమారు 1/8/- వెంటనేఆర్డరిచ్చి మీ దగ్గరి రైల్వేస్టేషనువ్రాయండి

**Midland Trading Co. Ltd.,**
P Box 16605, Calcutta-4.

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది మేహము,నిక్కాక,నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.
పి సి ఏ. &కంపెని."ఆయుర్వేదసమాజం"
పెరిదేపి- నెల్లూరు జిల్లా.


గను. అలాంటిది మీలాంటి గృహస్థు పది రూపాయ లెట్టి టిక్కట్టుకొని చేతిలోపెడితే ప్రాణం మా చెడ్డ సిగ్గుపడిపోతోంది' అన్నాడు వరహావతారం యింటరుక్లాసు పెట్టెలో కూర్చుని కిటికీదగ్గిరున్న సోమన్న గారితో.

'ఇదిగో, అలాఅంటేనే నాకు కష్టంగా ఉంటుంది. మావూరు మాపిల్లని చూసుకోడం కోసం వచ్చి నువ్వు టిక్కట్టు పెట్టుకుని మీవూరు వెళ్ళడమా? ఇదేమైనా న్యాయంగా ఉందేమో ఎవర్నైనా అడుగుదామా?'

'నాకు తెలిసింది కాదు. పెద్దల మనసు నొప్పించాను, క్షమించండి'

'ఇంత చిన్నదానికే మనస్సు కష్టపెట్టుకున్నావా? మొహం ఎదుట అనకూడదుగాని ఏం వినయమోయ్ నీకు? గంట కొట్టేశారు, వెడతాను మరి! మీ నాన్నగారితో సంగతులు నాలుగూ చెప్పు. వెంటనే ఉత్తరం రాయిస్తావుగదూ? నేను ఎప్పుడు రమ్మంటే అప్పుడొస్తాను ఉంటాను మరి!'

రైలు వెళ్ళిపోయింది. ఎంతో తేలికయిన మనసుతో అటే చూస్తున్న సోమన్న గారు ఎవరో పిలవగా యిటు చూశాడు. అది ఆయన పాతస్నేహితుడు సత్యంగొంతుక. ఆ రైలునుంచే దిగివస్తున్నట్టున్నాడు.

'ఏంరోయి సత్యం! ఎక్కడ్నుంచి యిలా?'

'అనకాపల్లినుంచిరా, మా తోడల్లుడి చెల్లెలికి పెళ్లంటేనూ మొన్నరాత్రి వెళ్లేను'

ఇద్దరు మిత్రులూ స్టేషనునుంచి యిళ్ళవైపు నడక సాగించారు.

'పెళ్లిళ్లు చాలా జోరుగా జరిగిపోతున్నాయే. ఇంక మీ రంగ డొక్కడైతే ఉండిపోయినట్టుంది మీ కుటుంబంలో' అన్నారు సోమన్న గారు.

'నీ దయవల్ల అదీ ఎన్నిరోజులో లేదులే!' అంత సంతోషంతో సత్యం చెప్పడం సోమన్న గారికి ఆశ్చర్యం కలిగించింది. సత్యం కూతురు రంగడికి యిరవైఏళ్లకు తక్కువ వుండవు. పైగా ఓ కాలు యీడుస్తూ నడుస్తుంది. అలాంటి పిల్లకి హఠాత్తుగా సంబంధం కుదరడం సోమన్న గారికి విచిత్రం అనిపించింది.

'ఎక్కడ సంబంధం?'

'బందరు డిప్యూటీ తాసిల్దారుగా రబ్బాయి కూర్మావతారమని మహా బుద్ధిమంతుడులే. తనే వచ్చి స్వయంగా చూసుకున్నాడు. ఇంక నా బాధ్యత తీరిపోయినట్టే. అదేమిటి నువ్వలా ఉన్నావ్?'

సోమన్న గారికి నిలువు గుడ్లు పడిపోయాయి. ఆయన అస్పష్టంగా గొణుక్కున్నాడు. బాలింతరాలికి పోసినట్టు నీళ్లు, పిడుగులాంటి మనిషికి అరగంట తలగోడుగు, మనుగుడుపుకి మేపినట్టు తిండి, పది రూపాయల టిక్కట్టు, జరీ పంచ— ఏనాటి ఋణసంబంధమని ఎవడికి యిచ్చినట్టు? జరిగిన సంగతి చెప్పేసరికి సత్యం చెవులు గళ్ళడిపోయాయి.

'ఎంతలా మోసపోయాంరా? పిల్లల్ని కనడంలో పరీక్ష పెడితే, ఫస్టు మార్కు తెచ్చుకునే ఆంధ్రదేశంలో, చదువు అందచందాల ప్రసక్తిలేకుండా మొగాడనే పరికల్లా విరగబడే రోజుల్లో, తమకి ఆడపిల్లలున్నా మొగపిల్లల్ని సంతలో అమ్మే మహానుభావులు కల కాలంలో యిలాంటి పెద్దమనుషులు లోట్లు కనిపెట్టి పొగడ్తలో మనుషుల్ని మరిపించి అప్పుడప్పుడు ప్రత్యక్షమై అప్పటికప్పుడు మాయమౌతున్నారన్నమాట! ఇలా పదిరోజుల పెట్టుగా నాలుగురోజులు గడిచినా గడిచినట్టే అని చూస్తున్నారన్నమాట! ఏంరా?'

'ఏం చెప్పను సత్యం? ముందు ఉత్తరం కూడా వస్తే నిజమే అనుకున్నాం గాని యిదంతా నాటకం అనీ 'ఉదర నిమిత్తం' అనీ ఎవడికి తెలుసు? శిష్టరక్షణకోసం అవతారం ఎత్తిన ఆ కృష్ణావతారమే యిలా వచ్చిందా అనిపించింది గాని ఉల్పాభక్షణ కోసం వచ్చిన, సాక్షాత్ కల్క్యవతారం అని ఎవరనుకున్నారు? స్వయంగా టిక్కట్టు కొనియిచ్చి పంపేనుకదా! ఈ పాటికి ఏ వామనావతారంలో ఉన్నాడో మాకు పంగనామాలు పెట్టిన వరహావతారం!'

'వరహావతార మేమిటి? నీ మొహం! మా అల్లుడు కూర్మావతారం!'

వెర్రి మొహాలతో మిత్రు లిద్దరూ యిల్లు చేరుకున్నారు. ఆతరువాత కన్నప్రాణం ఉండబట్టలేక వాకబు చెయ్యగా బందరు తాసిల్దారు ఆంగ్లో యిండియన్ లేడీ అనీ, ఆమెకు పెళ్ళే అవలేదనీ తేలింది! ★


